మార్కెట్లకు చవితి శోభ


కెప్టెన్ రామారావు జంక్షన్‌లో సిద్ధంగా ఉన్న పుట్టలు

- పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన కొనుగోలుదారులు
- కిక్కిరిసిపోయిన పూర్ణామార్కెట్, అల్లిపురం బజార్


పూర్ణామార్కెట్‌లో అమ్మకానికి సిద్ధమైన తేగలు, కొబ్బరికాయలు, చెరకు ముక్కలు

దీపావళి తర్వాత వచ్చే నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవటం ఆనవాయితీ. నాగేంద్రుడి పుట్టలో పాలు, గుడ్లు వేసి భక్తిప్రపత్తులు చాటుకుంటాం. దీపావళి సందర్భంగా కాల్చిన బాణసంచాలో మిగిలిన మందుగుండు కాల్చి చిమ్మిడి తిని ఇంటికి వస్తాం. ఈ నేపథ్యంలో నాగుల చవితిని పురస్కరించుకుని నగరంలోని పూర్ణామార్కెట్, అల్లిపురం పూజా సామగ్రి అమ్మకాలతో సందడిగా మారింది.

జగదాంబ : పూర్ణామార్కెట్ చవితి సందడి సంతరించుకుంది. పూజకు కావాల్సిన సరుకులు కొనుగోలు చేసేందుకు కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి విచ్చేయడంతో మార్కెట్ కళకళలాడిపోయింది. తేగలు, టెంకాయలు, చెరకు గడలు, పూలు, నువ్వులు, బెల్లం, కలగూరలు, పండ్ల విక్రయాలతో ఈ ప్రాంతమంతా సందడిగా తయారయింది. మార్కెట్‌లో సామగ్రి ధరలు అధికంగా ఉన్నాయని పలువురు కొనుగోలుదారులు వాపోయారు.

నాగుల చవితికి పుట్టలు సిద్ధం..

అల్లిపురం : నాగులచవితికి పుట్టలు సిద్ధమయ్యాయి. నియోజకవర్గంలో పుట్టలు తక్కువగా ఉండటంతో ఆర్టిఫిషియల్ పుట్టలు కెప్టెన్ రామారావు జంక్షన్, రైల్వేక్వార్టర్స్‌లో గురువారం సాయంత్రానికి సిద్ధం చేశారు. ఈ ఏడాది నాగుల చవితి శుక్రవారం జరుపుకునేందుకు భక్తులు సిద్ధపడ్డారు. ఈ నేపథ్యంలో కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయంలో పుట్టలు సిద్ధం చేశారు. అదే విధంగా టూటౌన్ దరి శివరామకృష్ణ దేవస్థానంలో సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో నాగుల చవితి పూజలకు సర్వం ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు.


పూజకు పత్రి కొనుగోలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ 30వ వార్డు కార్పొరేటర్ కొండమ్మ

ఆకాశాన్నంటిన ధరలు..

నాగుల చవితి సందర్భంగా అల్లిపురం, మహాత్మా గాంధీ మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడింది. ధరలు మాత్రం ఆకాశాన్నంటుతున్నాయని జనం వాపోతున్నారు. నాగన్నకు ఇష్టమైన చిమ్మిడికి ప్రధాన వస్తువులైన నూపప్పు కేజీ రూ.280 నుంచి రూ.300, బెల్లం రూ.55 నుంచి రూ.60, తంగేడు, గొబ్బిపువ్వులు అధిక ధరలకు అమ్ముతున్నారు.


పూర్ణామార్కెట్‌లో నాగుల గావంచా కొనుగోలు చేస్తున్న మహిళ


పూర్ణామార్కెట్‌లో అమ్మకానికి సిద్ధమైన కలగూరలు


పూర్ణామార్కెట్‌లో నువ్వులు కొనుగోలు చేస్తున్న మహిళలు

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన


తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలోను పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

లక్ష్మీనగర్ సమస్యలపై అధికారుల ఆరా


లక్ష్మీనగర్‌లో సమస్యలపై ఆరా తీస్తున్న అధికారులు

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డులో ఉన్న లక్ష్మీనగర్ మురికివాడలో ప్రజలు పడుతున్న ఇబ్బందుల నేపథ్యంలో కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ఇటీవల జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చిన విషయం తెలిసిందే. దానిపై స్పందించిన కలెక్టర్ గురువారం రెవెన్యూ అధికారుల బృందాన్ని లక్ష్మీనగర్‌ను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించడంతో అధికారుల బృందం గురువారం ఆ ప్రాంతంలో పర్యటించింది. ఈ ప్రాంతం అభివృద్ధికి కావల్సిన వసతులపై కలెక్టర్‌కు నివేదిక అందించనున్నట్లు ఇక్కడ పర్యటించిన అధికారులు తెలిపారు.

అనాధ శవానికి అంత్యక్రియలు


వృద్ధురాలి అంత్యక్రియలు చేస్తున్న మమత

అల్లిపురం : కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన అనాధ శవానికి మమత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు మమత అంత్యక్రియలు చేశారు. మృతురాలు అనాధ కావటంతో కేజీహెచ్ అధికారులు మమతకు తెలియజేయటంతో ఆమె అనాధ వృద్ధురాలి మృతదేహాన్ని జ్ఞానాపురంలో గల హిందూ స్మశాన వాటికలో ఖననం చేశారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు


అమ్మవారి సన్నిధిలో ద్రోణంరాజు శ్రీ వత్సవ్ తదితరులు

అల్లిపురం : వేంకటేశ్వరమెట్టలోని శ్రీ వేంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని నియోజకవర్గ నాయకుడు ద్రోణంరాజు శ్రీ వత్సవ్ గురువారం సాయంత్రం దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు భీశెట్టి శ్రీను, శరగడం మోహన్, కోరిబిల్లి త్రినాథ్, బొడ్డేటి ప్రసాద్, కోరిబిల్లి శ్యామ్ తదితరులు ఆయనకు స్వాగతం పలికి అమ్మవారి ప్రసాదం అందజేశారు. ఉత్సవాల సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన ఎస్‌కే మెలోడి ఆర్కెస్ట్రా ఆహూతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం, బొడ్డేటి ప్రసాద్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు.

బాక్సింగ్ పోటీల్లో వీఎంసీ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ తదితరులు

ఎంవీపీ కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల బాక్సింగ్ పోటీల్లో ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. 48 నుంచి 51 కేజీ విభాగంలో కళాశాల బీకామ్ విద్యార్థి సీహెచ్.పవన్‌కుమార్ వెండి పతకం సాధించగా.. 90 నుంచి 93 కేజీల విభాగంలో కళాశాల బీఎస్సీ విద్యార్థి ఎస్.సాయికుమార్ రజత పతకంతో మెరిశాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వరరావు, కళాశాల డైరెక్టర్ సుంకర రాహుల్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

వైభవంగా అయ్యప్ప తిరువీధి ఉత్సవం


విశేష అలంకరణలో రథంపై అయ్యప్ప స్వామి


స్వామి సన్నిధిలో మహిళల కోలాటం

అల్లిపురం : కేరళలోని అయ్యప్ప దేవాలయం తెరుస్తున్న సందర్భంగా అయ్యప్పల తిరువీధి ఉత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. సౌత్ జైలు రోడ్డలోని బీఆర్ రెడ్డి జంక్షన్ నుంచి గురుస్వామి, శ్రీ శివరామకృష్ణ దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ నీలాపు రమణారెడ్డి ఆధ్వర్యంలో టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో గల ధర్మశాస్త ఆలయం వరకు నిర్వహించారు. అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని రథంలో అలంకరించి రథాన్ని లాగుతూ అయ్యప్ప నామస్మరణతో 108 కలశాలతో అయ్యప్పలు, మహిళల కోలాటంతో అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం అయ్యప్పస్వామి మూలవిరాట్టుకి ఆలయ అర్చకుడు భార్గవ శర్మ క్షీరాభిషేకం చేసి, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, అయ్యప్పలు పాల్గొన్నారు.

రూ. 10 భోజనానికి 200 రోజులు


రూ. 10 భోజనాలు అందజేస్తున్న సంస్థ సభ్యులు

మహారాణిపేట : రౌండ్ టేబుల్ సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ స్వామి వివేకానంద సంస్థ సహకారంతో ప్రభుత్వ ప్రసూతి (ఘోష) ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులకు పది రూపాయలకే భోజనాలు అందించే కార్యక్రమం నేటికి 200 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా రౌండ్ టేబుల్ సంస్థ సభ్యులు మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు, వారి సహాయకులకు నారాయణ సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రతి రోజు పది రూపాయలకే భోజనాలు అందిస్తున్నామన్నారు. రౌండ్ టేబుల్ సభ్యులు విక్రాంత్ హనుమంతు, సందీప్ రెడ్డి, మక్సూద్ అహ్మద్, కల్యాణ్ ఆదిత్య, విరాజ్ పోలిశెట్టి, అరవిందు, రవి నల్లమోతు, భారత్ కొల్లపూడి, వివేకానంద సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో జ్ఞానం.. విజ్ఞానం


ఎంవీడీఎం హైస్కూల్లో తాము గీసిన చిత్రాలు చూపుతున్న చిన్నారులు


పుస్తకాలు పరిశీలిస్తున్న విద్యార్థులు, పాఠకులు


అల్లిపురం : గ్రంథాలయాలు జ్ఞానాన్ని పెంపొందిస్తాయని ఎంజీఎం హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీవీఎస్ నాగభూషణం అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అల్లిపురం శాఖా గ్రంథాలయంలో గురువారం పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాలలోనే కాకుండా ప్రతి రోజు గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. అధిక సంఖ్యలో పాఠకులు, విద్యార్థులు పాల్గొని పుస్తక ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో ఎంజీఎం హై స్కూల్ పీడీ ఎ. రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం, చందరంగం పోటీలు

డాబాగార్డెన్స్ : ఏవీఎన్ కళాశాలలో జరిగిన గ్రంథాలయ వారోత్సవాలలో గ్రంథాలయ అధికారి స్వరాజ్యలక్ష్మి, ఇమంది రంగారావు, సీహెచ్ రామకృష్ణ పాల్గొని అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమరావు, ఎస్ఆర్ రంగనాథన్ తదితర ఉద్యమకారులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంవీడీఎం హైస్కూల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, చదరంగం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి టి. పోలితల్లి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంవీడీఎం హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ వి. లలిత, క్రాఫ్ట్ టీచర్ వి. లక్ష్మి, పాఠకులు జయమ్మ, దేవి, దుర్గ, లలిత తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో..

ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ సాంకేతికాభివృద్ధి–సేవలు అనే అంశంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించినట్టు గ్రంథాలయ విభాగాధిపతి డాక్టర్ ఎ. ధరణి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ బి. హైమావతి, రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎ. హైమావతి, గణితశాస్త్ర విభాగాధిపతి కేవీఎస్ నాగలక్ష్మి, డాక్టర్ ఎన్. నిర్మల, డాక్టర్ జి. నాగశాంతి, లైబ్రరీ అసిస్టెంట్ ఎన్. మౌనిక తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ మహిళా కళాశాలలో మాట్లాడుతున్న గ్రంథాలయ విభాగాధిపతి డాక్టర్ ధరణి

పిల్లల్లో నేత్ర సమస్యలపై అవగాహన అవసరం

ఆరిలోవ: ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో బాలల నేత్ర సంరక్షణ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 19వ తేదీ వరకు జరగనున్నట్లు ఆస్పత్రి కంటి వైద్య నిపుణుడు డాక్టర్ స్నేహల్ గణత్ర తెలిపారు. ఈ మేరకు గురువారం పిల్లల తల్లిదండ్రులకు ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో మయోఫియా(హ్రస్వ దృష్టి), హైపర్ మెట్రోఫియర్(దూరదృష్టి), అస్టిగ్మాటిజం(ఒక పైపునకే దృష్టి సారించడం) తదితర సమస్యలు తలెత్తుతాయన్నారు. వీటి వల్ల పిల్లలు రోజువారీ పనులు చేసేటప్పుడు ఇబ్బందిపడుతుంటారన్నారు. చదువుతున్నప్పుడు తలనొప్పి, కళ్లకు అలసట రావడం జరుగుతుందన్నారు. అలాంటి వారిని వెంటనే కంటి వైద్యులకు చూపించాలని ఆయన సూచించారు. వారోత్సవాలులో భాగంగా పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కోసం ఈనెల 19న బీచ్ రోడ్డులో కాళీమాత ఆలయం వద్ద బాలల నేత్ర సంరక్షణ వాక్ నిర్వహించనున్నట్టు తెలిపారు.

సంక్షేమానికి చిరునామా.. వైఎస్ జగన్

- ప్రజలంతా సీఎంగా మళ్లీ జగన్‌నే కోరుకుంటున్నారు
- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్


పెయిందొరపేటలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్ : దేశ చరిత్రలోనే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని శతశాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి నిలుస్తారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. నవరత్నాల పేరిట లబ్ధిదారులకు ఇంటి వద్దే పథకాలు అందిస్తూ సంక్షేమానికి చిరునామాగా నిలిచిన జగనే మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. జీవీఎంసీ 37వ వార్డు పరిధి పెయిందొరపేట-2 సచివాలయం పరిధిలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే'కార్యక్రమం గురువారం నిర్వహించి సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. జెండా ఎగురవేశారు. అనంతరం ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ ప్రతి గడపకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని.. రానున్న ఎన్నికల్లో ప్రతి ఇంటిపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేయాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో పార్టీలు, కులమతాలకు అతీతంగా ప్రతి ఇంటికి మేలు జరిందన్నారు. ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా సమయంలో కూడా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ఎక్కడా ఆగకుండా ప్రజలకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. నాలుగున్నరేళ్ల పాలన తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి ప్రతినిధులుగా తాము ఇంటింటికీ వెళుతుంటే ప్రజలు సంతోషంగా ఆహ్వానిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సంక్షేమ పాలన సాగాలని.. రాష్ట్రానికి మళ్ళీ జగనే కావాలని ఆకాంక్షిస్తున్నారని వెల్లడించారు.


పెయిందొరపేటలో జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్ జానకీరామ్


పెయిందొరపేట కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, లబ్ధిదారులు

సచివాలయం పరిధిలో..

సచివాలయం పరిధిలో ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) మొత్తం రూ.8 కోట్ల 46 లక్షలు, పరోక్ష ప్రయోజనాలుగా రూ.4 కోట్ల 30 లక్షలు, మొత్తంగా సచివాలయ పరిధిలో రూ.12 కోట్ల 76 లక్షలు అర్హులైన అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు, అవ్వాతాతలకు పారదర్శకంగా అందజేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, పార్టీ మండల అధ్యక్షుడు పీతల వాసు, కలెక్టర్ ఇన్‌చార్జి కోన శంకర్, వార్డు అధ్యక్షుడు నొల్లు పోతుస్వామి, డేవిడ్‌రాజు, టీకే ప్రసాద్, కాసారపు వాసు, వంకా శ్రావణ్, ఆకుల యేసు, దైవకుమార్, నర్సింగ్, వంశీ, కోరాడ సురేష్, సంతోష్, ఆదిలక్ష్మి, రోజా, రమణి, గురులక్ష్మి, ఆర్పీలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులకు ఉచిత శిక్షణ

తాటిచెట్లపాలెం: జన శిక్షణ సంస్థాన్, వరల్డ్ టీచర్ ట్రస్ట్ (జగద్గురు పీఠం) సంయుక్తంగా తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఈకే సంస్కృతి సదన్‌లో పలు వృత్తి విద్యా కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ప్రారంభిస్తున్నట్లు జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 45 ఏళ్ల వయసు గల మహిళలు అర్హులని చెప్పారు. ఈ నెల 22లోగా తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఈకే సంస్కృతి సదన్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల లోపు తమ పేర్లు, వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. కంప్యూటర్ కోర్సు (3 నెలలు), హ్యాండ్ ఎంబ్రాయిడరీ (3 నెలలు), బ్యూటీషియన్ (3 నెలలు) వంటి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. వీటిని విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి పరీక్షలు నిర్వహించి, భారత ప్రభుత్వం ద్వారా గుర్తింపబడిన సర్టిఫికెట్లు అందజేయనున్నామని సత్యదేవ్ తెలిపారు.

సాధికార యాత్ర విజయవంతానికి సన్నాహాలు

జగదాంబ : సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు జీవీఎంసీ 35వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అలపన కనకరెడ్డితో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడారు. ఈనెల 22న జరిగే ప్రజా సామాజిక సాధికార బస్సు యాత్రపై రూట్‌మ్యాప్‌పై చర్చించారు. డైమండ్ పార్కు మీదుగా న్యూకాలనీ, అక్కడి నుంచి రైల్వే స్టేషన్‌రోడ్డు, అల్లిపురం గోకుల్ థియేటర్ వరకు యాత్ర నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేశారు. అచ్చియమ్మపేట జీవీఎంసీ పాఠశాల వద్ద విద్యార్థులతో సమావేశం, మనోరమ థియేటర్ వద్ద వైఎస్సార్ అర్బన్ క్లినిక్‌లో పేషెంట్లతో ముఖాముఖి జరపనున్నారు. అనంతరం రైతుబజార్, డాల్ఫిన్ హోటల్ రోడ్డు, జగదాంబ జంక్షన్‌కు చేరుకుంటారు. అక్కడున్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారు. అక్కడి నుంచి టర్నర్ చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, టౌన్ కొత్తరోడ్డు, సీహార్స్ జంక్షన్ సభా ప్రాంగణానికి చేరుకుంటారు. అక్కడ సమావేశం నిర్వహిస్తారు. ఈ యాత్ర విజయవంతం చేసేందుకు పార్టీలో అందరి ఇంటికి వెళ్లి యాత్ర విజయవంతానికి సన్నాహాలు చేస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు.


35వ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి

19న సుబ్రహ్మణ్యస్వామి స్కంద షష్ఠి



కంచరపాలెం: ఈ నెల 19న కార్తీక మాస శుద్ధ స్కంద షష్ఠి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శరవణ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 5 గంటలకు కలశ స్థాపన, గోక్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, పన్నీరు, చందన, అన్నాభిషేకాలు చేస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దేవాల రాజు(కృష్ణ) తెలిపారు. సాయంత్రం 5 గంటలకు వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం జరుగుతుందన్నారు. భక్తులు తిలకించి తరలించాలని ఆయన కోరారు.

షాదీఖానా, ఈద్గా నిర్మాణానికి వినతి


స్టేట్ మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ముస్లిం నాయకులు

మహారాణిపేట : రాష్ట్రంలో ప్రతి జిల్లా, మండలానికి షాదీఖానా, ఈద్గా, ఉర్దూ రెసిడెన్షియల్ స్కూలు, కాలేజీ ఏర్పాటు చేసి, ఉర్దూ టీచర్ల నియామకం చేయాలని నూర్ బాష ముస్లిం నాయకులు కోరారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఏపీ స్టేట్ మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్ బాష ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ షేక్ బాబ్జీ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించారు. ముస్లిం శ్మశాన వాటికి కోసం ఒక ఎకరం నుంచి రెండెకరాల వరకు స్థలం మంజూరు చేసి, ప్రభుత్వ నిధులతో ప్రహరీ నిర్మించాలని కోరారు. మసీదులకు ప్రభుత్వ సబ్సిడీతో విద్యుత్, మంచినీటి సదుపాయం కల్పించాలన్నారు. 11 డిమాండ్లతో వినతి పత్రం సమర్పించారు. కమిషన్‌ను కలిసిన వారిలో రాష్ట్ర మహిళా గౌరవ అధ్యక్షురాలు షేక్ మున్నీ, షేక్ నాగూర్, షేక్ మదీనా తదితరులున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు మైక్‌సెట్ ఉపయోగకరం


మైక్‌సెట్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్

కంచరపాలెం: ట్రాఫిక్ నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాలకు గురి కాకుండా ఉండాలని జోన్–2 ట్రాఫిక్ ఏసీపీ జి.రాజీవ్‌కుమార్ అన్నారు. కంచరపాలెం వై జంక్షన్ నేతాజీ వంతెన వద్ద గల పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్‌కు గురువారం 56వ వార్డు గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘానికి చెందిన పెంటకోట నూకరాజు మైక్‌సెట్ వితరణ చేశారు. దీనిని ముఖ్య అతిథిగా ఏసీపీ ప్రారంభించి మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణకు మైక్‌సెట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు, ఎస్ఐలు వాసుదేవరావు, పాపారావు ఉల్లాక్, సంఘ అధ్యక్షుడు వెంకటరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆడారి శ్రీను, కొణతాల నర్సింగరావు, మాజీ అధ్యక్షుడు మళ్ల శంకరరావు, బలరామ్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.